సూర్యోదయ వార్త

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 31 | మంగళవారం 27.10. 2026 | పేజీలు :4 | వెల: 2

వర్షాలు వస్తున్నాయ్..

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుభవార్త
- అర్నాబ్ తుపాను ప్రభావంతో తెలంగాణలో వానలు



హైదరాబాద్ సూర్యోదయ వార్త

వర్షాలు లేక ఎండిపోతున్న పంటలు చూసి అల్లాడుతున్న రైతులకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుభవార్త చెప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. నేడు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటలకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరిక

రేపు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్ బాద్ జిల్లాల్లో అతిభారీ వర్షం పడే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది.



మహారాష్ట్ర సానుకూలం

తుమ్మిడిహెట్టి 152 మీటర్ల ఎత్తు ప్రతిపాదనపై పునఃపరిశీలనకు సిద్ధం



హైదరాబాద్ సూర్యోదయ వార్త

అధికారుల కమిటీ ఏర్పాటుకు సూచన

- బ్యారేజీ ఎత్తు, ముంపు, నీటి లభ్యతపై సమగ్ర అధ్యయనం
- ఆదిలాబాద్ ఆదివాసీల సాగు, తాగునీటి కల సాకారానికి అడుగు
- ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సంసిద్ధత
- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో చర్చలు సఫలం
- 'ఎక్స్' పోస్టు ద్వారా వెల్లడించిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం, ఎత్తు పెంపుపై తెలంగాణ ప్రతిపాదనకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. మహారాష్ట్రకు, అక్కడి ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకపోతే ప్రస్తుతం 148 మీటర్లుగా ఉన్న ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథి గృహంలో సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం సమావేశమైంది. ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం, దాని ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు

- మిగతా 2 లో..

అమిత్ షా పరువు నష్టం కేసులో

రాహుల్‌కు ఊరట

- ఫిర్యాదుదారు బాధితుడిగా పరిగణనలోకి రారని కోర్టు వ్యాఖ్య
- ఎనిమిదేళ్ల న్యాయపోరాటానికి తెర.. కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు
- సుల్తాన్‌పూర్ వెళ్తుండగా కాన్వాయ్‌లో స్వల్ప ప్రమాదం



హైదరాబాద్ సూర్యోదయ వార్త

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కోర్టులో ఊరట లభించింది. 2018లో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు సోమవారం రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటించింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుభం వర్మ తీర్పు వెలువరించారు.తీర్పు సమయంలో రాహుల్ గాంధీ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు.

2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో బెంగళూరులో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై స్థానిక బీజేపీ నేత విజయ్ మిశ్రా 2018 ఆగస్టు 4న పరువు నష్టం ఫిర్యాదు చేశారు. అమిత్ షాను హత్య కేసులో నిందితుడిగా పేర్కొంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఫిర్యాదుదారు ఆరోపించారు. భారతీయ శిక్షాస్మృతిలోని 499, 500 సెక్షన్ల కింద కేసు కొనసాగింది.

ఫిర్యాదుదారుడి అర్హతపైనా వ్యాఖ్యలు

విచారణ సందర్భంగా రాహుల్ గాంధీ తరఫు న్యాయవాదులు తన వ్యాఖ్యలను సందర్భం నుంచి విడదీసి చూపించారని వాదించారు. తాజాగా తీర్పు వెలువరిస్తూ రాహుల్ వ్యాఖ్యలు పరువు నష్టం కలిగించే స్వభావం కలిగినవి కావని కోర్టు పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఫిర్యాదుదారు విజయ్ మిశ్రా ఈ కేసులో బాధితుడిగా పరిగణనలోకి రావడానికి అర్హుడు కాదని కూడా కోర్టు అభిప్రాయపడినట్లు రాహుల్ తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో ఈ కేసులో రాహుల్ గాంధీకి ఊరట లభించింది. తీర్పుపై కాంగ్రెస్ కార్యకర్తలు కోర్టు వెలుపల సంబరాలు చేసుకున్నారు.

- మిగతా 2 లో..

మారువేషంలో నేపాల్ వెళ్లి

సెర్చ్ ఆపరేషన్

మాజీ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య హత్య కేసు

వివరాలు వెల్లడించిన సీపీ సజ్జనర్



గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా

ఉత్తమ్ నిరూపిస్తారా? : హరీశ్‌రావు సవాల్

హైదరాబాద్ సూర్యోదయ వార్త



తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్లు తీసుకురాగలమని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్లు తీసుకురావడం సాధ్యం కాదని తేలితే ఉత్తమ్‌కుమారెడ్డి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను కలిసిన నేపథ్యంలో

- మిగతా 2 లో..



గుడుంబా రహిత గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దిద్దాం..

- లింగాల గ్రామంలో గుడుంబాపై గ్రామస్తుల సమరశంఖం!
- గ్రామ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ ఆధ్వర్యంలో గుడుంబా డబ్బాల ధ్వంసం.
- మళ్లీ గుడుంబా విక్రయిస్తే రూ.50 వేల జరిమానా విధించాలని గ్రామసభ తీర్మానం..
- గుడుంబా విక్రయదారులకు ప్రభుత్వ పథకాలు రద్దు చేయాలని ఏకగ్రీవ నిర్ణయం..

తాడ్వాయి .ములుగు జిల్లా అక్టోబర్ 26:
(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– గ్రామంలో గుడుంబా విక్రయాలను పూర్తిగా అరికట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడమే లక్ష్యంగా ములుగు జిల్లా తాడ్వాయి మండలం లింగాల గ్రామపంచాయతీ పరిధిలోని లింగాల గ్రామంలో గ్రామస్తులు కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి మోడెమ్ రాజేష్, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు కలిసికట్టుగా గుడుంబా నిర్మూలనకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో ఉన్న గుడుంబా డబ్బాలను పగలగొట్టి, గుడుంబా విక్రయాలపై తమ వ్యతిరేకతను స్పష్టం చేశారు. గుడుంబా సేవనం వల్ల కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, సామాజిక సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని గ్రామస్తులు నిర్ణయించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు కలిసి గ్రామంలో గుడుంబా విక్రయాలకు తావులేకుండా చూడాలని సంకల్పించారు. ఇకపై ఎవరైనా గ్రామంలో గుడుంబా విక్రయాలు కొనసాగించినా, తిరిగి గుడుంబా నిల్వలు ఏర్పాటు చేసినా రూ.50 వేల జరిమానా విధించడంతో పాటు, వారికి వర్తించే ప్రభుత్వ సంక్షేమ పథకాలను రద్దు చేయాలనిలిలి గ్రామస్తుల అంగీకారంతో తీర్మానం చేశారు. గ్రామంలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పడం, మహిళలు మరియు కుటుంబాలు గుడుంబా వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడం, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయడం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, గుడుంబా నిర్మూలన ఒక్కరి బాధ్యత కాదని, గ్రామంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మహిళా సంఘాలు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో గుడుంబా రహిత గ్రామంగా లింగాలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో గుడుంబా విక్రయాలు మళ్లీ ప్రారంభం కాకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజలందరూ ఐక్యంగా నిలబడి ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని గ్రామస్తులు తీర్మానించారు. గుడుంబా నిర్మూలన దిశగా లింగాల గ్రామ ప్రజలు తీసుకున్న ఈ నిర్ణయం గ్రామంలో సామాజిక మార్పునకు నాంది కావాలని పలువురు ఆకాంక్షించారు.


చల్వాక ఎస్సీ కాలనీకి ఉచిత విద్యుత్ వెలుగులు!

- డీఎన్‌డీ పథకం కింద కిలోమీటరు మేర విద్యుత్ లైన్ ఏర్పాటు.
- కాలనీ అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనే లక్ష్యం:
- గ్రామ పంచాయతీ సర్పంచ్ - అట్టం రాంబాబు.

ఏటూరునాగారం, అక్టోబర్ 26:(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– ఏటూరునాగారం మండలం చల్వాక గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ ప్రజలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు డీఎన్‌డీ పథకం కింద ఒక కిలోమీటరు మేర ఉచితంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అట్టం రాంబాబు మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతులు కల్పించడం అభివృద్ధిలో





కీలకమని పేర్కొన్నారు. కాలనీలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి సమస్యలను కూడా పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా డీఈ పురుషోత్తం, ఏటూరునాగారం ఏఈ శేఖర్, లైన్‌మెన్ రాజేష్, అసిస్టెంట్ లైన్‌మెన్ హరీష్, వార్డు సభ్యుడు పడిదల సారయ్య, ఏటూరునాగారం కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కర్నే సత్యం, కర్నే వెంకటేష్, పడిదల చిన్నన్న తదితరులు పాల్గొన్నారు..



తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీలు..

పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా 'యాంటీ డ్రగ్స్ ఆ సైబర్ సెక్యూరిటీ' అంశాలపై వ్యాసరచన పోటీలు:..



ఏటూర్ నాగారం. ములుగు జిల్లా. అక్టోబర్ 26(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా ఏటూరు నాగారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకుని విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, అవగాహన పెంపొందించే లక్ష్యంతో 'యాంటీ డ్రగ్స్ (మత్తు పదార్థాల నిర్మూలన)' మరియు 'సైబర్ సెక్యూరిటీ (డిజిటల్ భద్రత)' అనే అంశాలపై సోమవారం వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి . రేణుక తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి . రేణుక మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు సైబర్ నేరాలు మరియు డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు విస్తృతమైన అవగాహన అవసరమని పేర్కొన్నారు. దేశ రక్షణలో, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉద్ఘాటించారు.ఈ కార్యక్రమం లో ఎస్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సిహెచ్. వెంకటయ్య, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ నవీన్, ఎల్ వో ఎ సి కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. జ్యోతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ కనీస్ ఫాతిమా, అధ్యాపకులు జీవవేణి, శ్రీధర్, రమేష్, శ్రీకాంత్, రాజశేఖర్ లతో పాటు ఇతర అధ్యాపక బృందం, నాన్-టీచింగ్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు...

ములుగు ఏజెన్సీలో పెరిగిన చలి తీవ్రత..

ములుగు. అక్టోబర్ 26- (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



ములుగు ఏజెన్సీ ప్రాంతంలో మూడు రోజులుగా చలి తీవ్రత పెరుగుతుంది. ఇటీవల ఎండలు తీవ్ర స్థాయిలో నమోదై ప్రజలను ఇబ్బందులకు గురి చేయగా . వాతావరణ పరిస్థితుల మార్పుల కారణంగా ప్రస్తుతం చలి ప్రభావం అధికమైంది. ముఖ్యంగా అటవీ గ్రామాల్లో ఉదయం. రాత్రి వేళల్లో చలి ఎక్కువగా ఉండడంతో ఏజెన్సీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం వేళ మంచు సైతం పడుతుండడంతో ఉష్ణోగ్రతను తగ్గుతున్నాయి...

ఇంకుడు గుంత నిర్మాణం ప్రారంభం...

- ఇంకుడు గుంత ఏర్పాటుతో నీటి నిల్వ సమస్య పరిష్కారం ..
- కోయగుడ గ్రామపంచాయతీ సర్పంచ్ . సరిత.



ఏటూరు నాగారం. ములుగు జిల్లా. అక్టోబర్ 26 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– ఇంకుడు గుంత ఏర్పాటుతో నీటినిల్వ సమస్య పరిష్కారం అవుతుందని ఏటూరు నగరం మండలం కోయగుడ సర్పంచ్ సరిత అన్నారు. లంబాడి తండా అంగన్వాడి కేంద్రంలో చేతిపంపు వద్ద నీరు నిల్వ ఉండకుండా . నీటిపారుదల కోసం వి బి జి రామ్ జి పథకం కింద కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మాణ పనులను సర్పంచ్ సరిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆరుదబ్ల్యూఎస్ ఏఈ చారి. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ. కారోబార్ ఇరుస వడ్ల రాజు. గ్రామస్తులు పాల్గొన్నారు..

ధాన్యం సేకరణకు సిద్ధం..

- ఈసారి 143 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు..
- ములుగు జిల్లా సివిల్ సప్లై మేనేజర్. కృష్ణవేణి



ములుగు. అక్టోబర్ 26- (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– వానాకాలం సీజన్ లో పండించిన ధాన్యాన్ని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని ములుగు జిల్లా సివిల్ సప్లై మేనేజర్ కృష్ణవేణి తెలిపారు. నవంబర్ 2 వ.వారంలో పంట కోతకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈసారి 143 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 1.50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణను టార్గెట్ గా పెట్టుకోవా 85 వేల మెట్రిక్ టన్నుల సన్నం 40 వేల టన్నులు. దొడ్డు 45 వేల టన్నులు వచ్చే అవకాశం ఉందన్నారు. లారీలకు జిపిఎస్ అమర్చుతామన్నారు...

డ్రైనేజీ పనుల నాణ్యత పై విమర్శలు...



ఏటూరు నాగారం. ములుగు జిల్లా.. అక్టోబర్ 26 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం రాంనగర్ . లంబాడి తండ గ్రామాల్లో చేపట్టిన సైడ్ డ్రైనేజీ పనుల నాణ్యత పై స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సి ఆర్ ఆర్ నిధులతో నిర్మిస్తున్న కాలువల నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని నిర్మాణం పూర్తికాకముందే పగుళ్ళు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారుల దగ్గరుండి పనులను పరివేక్షించవలసి ఉండగా కాంట్రాక్టర్ గుమస్తాలే పనులు నిర్వహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి..

కొమురం భీమ్ 86వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..

- ఆదివాసీ హక్కుల సాధనకు కొమురం భీమ్ పోరాట స్ఫూర్తి మార్గదర్శకం..
- ఏటూరునాగారం వై జంక్షన్ వద్ద విగ్రహానికి పూలమాలలు వేసిన తుడుందెబ్బ నాయకులు..





ఏటూరునాగారం, ములుగు జిల్లా అక్టోబర్ 26: (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీ విప్లవ వీరుడు, హక్కుల పోరాట యోధుడు కొమురం భీమ్ 86వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ చేసిన వీరోచిత పోరాటాన్ని, ఆదివాసీ సమాజ హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన త్యాగాలను నాయకులు స్మరించుకున్నారు. కొమురం భీమ్ తన జీవితాన్ని ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆదివాసీలు తమ భూములు, అడవులు, జల వనరులపై హక్కులను కాపాడుకోవాలనే లక్ష్యంతో ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. ఆయన ఇచ్చిన-జల్--జంగల్--జమీన్'- నినాదం ఆదివాసీ సమాజ హక్కుల పోరాటానికి నేటికీ స్ఫూర్తినిస్తోందని అన్నారు. ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న భూ సమస్యలు, అటవీ హక్కులు, ఉపాధి, విద్య, వైద్యం వంటి సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి అవసరమని నాయకులు పేర్కొన్నారు. కొమురం భీమ్ ఆశయాలను కేవలం జయంతులు, వర్ధంతులకే పరిమితం చేయకుండా, ఆయన చూపిన పోరాట మార్గంలో నడుస్తూ ఆదివాసీల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టపరమైన రక్షణలు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యేలా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని తెలిపారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, భాష, జీవన విధానాన్ని కాపాడుకుంటూ రాబోయే తరాలకు కొమురం భీమ్ పోరాట చరిత్రను తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. కొమురం భీమ్ ఆశయ సాధనే ఆయనకు అందించే నిజమైన నివాళి అని, ఆదివాసీ సమాజ హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం తుడుందెబ్బ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జాతీయ కార్యదర్శి పోదేం కృష్ణప్రసాద్, ఆల్ ఇండియా ఎంప్లాయిస్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ కోట రవి, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి కొమురం లక్ష్మికాంత, రాష్ట్ర కార్యదర్శి వట్టం జనార్దన్, నాయకపోడ్ పోడ్ దెబ్బ సీనియర్ నాయకులు బొల్లెం సారయ్య, ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకుల ధర్మయ్య, తుడుం దెబ్బ ఏటూరునాగారం మండల అధ్యక్షులు తాటి నీలాద్రి,మహిళ నాయకులు ఆలం సత్యనారాయణమ్మ, ఇతర ఆదివాసీ నాయకులు పాల్గొని కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలి.

- ట్టబడుల ఓటయ నఎడు"యివన కాంగస్ ్యక ధృష్టి ఎరించాలి
- అవ్ఞన ।ట్టబడుడు ఓటయగా నఎడు చసు"నా కృషి చయలి.
- మంగపేట మండల కాంగస్ ఎట్టీ అధ్య"లు చట్టణ్లె ఎంకటశ్ల్లు.
- లంగాణ రాష్ట్ర ంవాణా శఖ డంక్టర్- వసం శ్రీ"వాస్

మంగపేట. ములుగు జిల్లా ,అక్టోబర్ 26:(సూర్యోదయ వార్త.)





ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు,ఓటరు నమోదు అంశాలపై సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, వసంత శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి యువజన కాంగ్రెస్ నాయకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.వరంగల్--నల్గొండ--ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మండల పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు,తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ పిలుపునిచ్చారు.గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు సీనియర్ కాంగ్రెస్ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించి,దరఖాస్తు ప్రక్రియలో అవసరమైన సహకారం అందించాలని సూచించారు.నవంబర్ 6 వరకు ఓటరు నమోదు గడువు ఉన్నందున అర్హులైన పట్టభద్రులందరూ గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు.రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా పట్టభద్రులను చైతన్యపరచాలని పేర్కొన్నారు.. మంగపేట మండలం నుంచి కాంగ్రెస్ పార్టీకి బలమైన మద్దతు అందించి,మొదటి ప్రాధాన్యత ఓటుతో పార్టీ అభ్యర్థిని గెలిపించడం ద్వారా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క కు విజయాన్ని కానుకగా అందించాలని నాయకులు పిలుపునిచ్చారు..కాంగ్రెస్ పార్టీకి ఉన్న రాజకీయ బలాన్ని ఓట్ల రూపంలో విజయంగా మలుచుకునేందుకు ప్రతి నాయకుడు,కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని వారు సూచించారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే ధ్యేయంగా యువజన కాంగ్రెస్ నాయకులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు..ఈ కార్యక్రమంలో ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,రామన్నగూడెం సర్పంచ్ గద్దల నవీన్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరెందర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి జంగం భానుచందర్, యువజన కాంగ్రెస్ మండల గౌరవ అధ్యక్షులు కుర్సం రమేష్, యువజన కాంగ్రెస్ నాయకులు కారుపోతుల మణివర్మ,కబ్బాక లక్ష్మణ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మూగల చంటి,ఐఎన్టియూసి పుల్లూరి తిరుపతి, మండల నాయకులు చిన్నపెళ్లి రాంబాబు, బూర్గుల సతీష్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ములుగు జిల్లా కలెక్టర్ - బోర్కడే హేమంత్ సహదేవరావు.



ములుగు. అక్టోబర్ 26 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, అవసరమైన చోట క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుపై తీసుకున్న చర్యలను సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలని ఆదేశించారు.ఈ ప్రజావాణిలో మొత్తం 28 దరఖాస్తులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 9, ఇందిరమ్మ ఇళ్లకు 2, పింఛన్లకు 3, ఇతర సమస్యలకు సంబంధించి 14 దరఖాస్తులు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి రవి కుమార్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

ములుగు జిల్లాలో అక్రమ ఇసుక మైనింగ్ కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు..



ములుగు, అక్టోబర్ 26: (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లాలో జరుగుతున్న అక్రమ ఇసుక మైనింగ్‌కు వ్యతిరేకంగా పూనెం రాములు గతంలో చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్ జి టి) లో దాఖలు చేసిన కేసులో స్టే ఉత్తర్వులు జారీ అయిన విషయం తెలిసిందే. ఈ స్టేను ఎత్తివేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సివిల్ అప్పీల్ దాఖలు చేసింది. నేడు సుప్రీంకోర్టులో సీ .ఏ . నెంబర్. 13696/2026, ఐటమ్ నంబర్ 24 గా ఈ కేసు విచారణకు వచ్చింది. విచారణ సందర్భంగా జస్టిస్ జ్యోమాల్యా బగ్చి ధర్మాసనం ఈ వ్యవహారాన్ని ఎన్ జి టి లోనే పరిష్కరించుకోవాలని సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను తోసిపుచ్చింది. పిటిషనర్ పూనెం రాములు తరపున లాయర్ పెనుబల్లి రమేష్ బాబు వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఎన్ జి టి లో ఇచ్చిన స్టే కొనసాగనుంది. దీంతో ములుగు జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలపై నిషేధం కొనసాగుతుందని పర్యావరణ వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

మల్లూరు క్షేత్రంలో అటవీ శాఖ సిసిఎఫ్ ప్రభాకర్ ప్రత్యేక పూజలు..



మండపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 26 (సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి వారిని సోమవారం కాళేశ్వరం జోన్ అటవీ శాఖ సిసిఎఫ్ ప్రభాకర్ దర్శించుకున్నారు.ఆలయానికి విచ్చేసిన సిసిఎఫ్ ప్రభాకర్ కి ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ సాంప్రదాయ ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వామివారికి వారి పేరిట ప్రత్యేక అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మల్లూరు క్షేత్ర విశిష్టతను, స్వామివారి వైభవాన్ని ఆయనకు వివరంగా తెలియజేశారు.దర్శన అనంతరం వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించి, స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, సిబ్బంది మరియు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కోమటిపల్లి - కటాపూర్ రోడ్డు పనులు ప్రారంభం

హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి సీతక్క కు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు..



మంగపేట,అక్టోబర్.(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండలం కోమటిపల్లి నుండి కాటాపూర్ వరకు నూతనంగా నిర్మించనున్న బీటీ, సీసీ రోడ్డు పనులను మసిరెడ్డి వెంకట్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరయ్యాయి అని తెలిపారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ నిధులతో కోమటిపల్లి, కొత్తూరు, మొట్లగూడెం గ్రామాల గుండా సీసీ రోడ్డుతో పాటు, రోడ్డుకు ఇరువైపులా మురుగు నీటి పారుదల కోసం డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీరుతుందని, మౌలిక వసతుల కల్పనకు మంత్రి సీతక్క నిరంతరం కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు..

తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో 30న హుండీల లెక్కింపు..



మంగపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 26 (సూర్యోదయ వార్త)

– ములుగు జిల్లా, మంగపేట మండలం మల్లూరు గ్రామంలో వెలసియున్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహస్వామివారి దేవస్థానంలో భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలు మరియు మొక్కుబడి హుండీల లెక్కింపును ఈ నెల 30వ తేదీ (శుక్రవారం) నిర్వహించనున్నారు. ఈ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం ఉదయం 10:00 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో ప్రారంభమవుతుందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అధికారుల పర్యవేక్షణలో, పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

- రామప్ప ఆలయం పై నిండు చంద్రుడు..

వెంకటాపూర్. ములుగు జిల్లా. అక్టోబర్ 26 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప ఆలయ ఆవరణంలో సోమవారం సాయంత్రం వేళ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. పౌర్ణమి వేల నిండు చంద్రుడు ఆలయ గోపురం పై దర్శనమిచ్చాడు. చంద్రుని కాంతితో ఆలయం మెరిసిపోయింది. అరుదైన ఈ దృశ్యాన్ని పర్యాటకులు ఆసక్తిగా తిలకించి తమ కెమెరాలో బంధించుకున్నారు. చంద్రుని చల్లని నీడలో కాసేపు పర్యాటకులు సేద తీరారు...

కోమటిపల్లి - కటాపూర్ రోడ్డు పనులు ప్రారంభం..

- హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి సీతక్క కు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు..



ంగపేట,అక్టోబర్.(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండలం కోమటిపల్లి నుండి కాటాపూర్ వరకు నూతనంగా నిర్మించనున్న బీటీ, సీసీ రోడ్డు పనులను మసిరెడ్డి వెంకట్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 16 కోట్లు మంజూరయ్యాయి అని తెలిపారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ నిధులతో కోమటిపల్లి, కొత్తూరు, మొట్లగూడెం గ్రామాల గుండా సీసీ రోడ్డుతో పాటు, రోడ్డుకు ఇరువైపులా మురుగు నీటి పారుదల కోసం డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీరుతుందని, మౌలిక వసతుల కల్పనకు మంత్రి సీతక్క నిరంతరం కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు..

జాతీయ అథ్లెటిక్స్‌లో విద్యార్థికి కాంస్యం..

విద్యార్థి గూడెల్లి బాచి నీ అభినందించిన తెలంగాణ మోడల్ స్కూల్ - ప్రిన్సిపాల్. సింగారం దేవకి.

ములుగు. అక్టోబర్ 26 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



చెన్నైలో నిర్వహించిన 41 వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2026 లో ములుగు జిల్లా బండారుపల్లి పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్కి చెందిన విద్యార్థి గూడెల్లి బాచి 1000 మీటర్ల రిలే భాగంలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పత కం సాధించాడు. తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సింగారపు దేవకి విద్యార్థిని అభినందించారు. శిక్షణ ఇచ్చిన పిడి కునూరు నాగరాజును ప్రశంసించారు . బాచి మరిన్ని విజయాలు సాధించి. ములుగు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ములుగు జిల్లాలో చిరుత కలకలం..

అడవిలోనికి వెళ్ళ వద్దంటూ - హెచ్చరిక జారీ చేసిన అటవీశాఖ అధికారులు...



ములుగు. అక్టోబర్ 26 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా ఏటూరు నాగారం – మంగపేట అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు సమాచారం అందించారు. రాంనగర్. లంబాడి తండా. కొమరం భీమ్ నగర్. పస్కాపూర్ గ్రామాల ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులను మేపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని. అడవిలోనికి ఒంటరిగా వెళ్లవద్దని కోరారు. చిరుత కనిపిస్తే దగ్గరకు వెళ్లకుండా అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.

మహర్షి వాల్మీకి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

- **ఐడిఓసీ లో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు...**
- **ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**





ములుగు. అక్టోబర్ 26 - (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– మహర్షి వాల్మీకి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సత్యం, ధర్మం, నైతిక విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనాతో కలిసి జిల్లా కలెక్టర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణ మహాకావ్యం ద్వారా సత్యం, ధర్మం, మానవీయ విలువలను చాటిన మహనీయుడు వాల్మీకి అని పేర్కొన్నారు. ఆదికవిగా భారతీయ సాహిత్యంలో విశిష్ట స్థానం పొందారని తెలిపారు. రామాయణంలో వివరించిన కుటుంబ బంధాలు, బాధ్యతలు, నైతిక విలువలు నేటి సమాజానికి మార్గదర్శకమని అన్నారు. యువత మహనీయుల జీవితాలను అధ్యయనం చేసి, వారి ఆదర్శాలను ఆచరణలో పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్. మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి రవి కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి రామ్మోహన్, వాల్మీకి కుల సంఘం సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు...

ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి...

- **ఓటరు దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి..**
- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి - సుదర్శన్ రెడ్డి.**





ములుగు. అక్టోబర్ 26 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– ఎస్ఐఆర్--2026 ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటరు దరఖాస్తుల పరిష్కారం, సంబంధిత రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్--2026 కార్యక్రమంపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు సమీకృత కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని నోటీసులపై ప్రక్రియను వచ్చే వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను తగిన ఆధారాలతో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో తిరస్కరణ కేసులకు సంబంధించి, తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా పేర్కొంటూ తప్పనిసరిగా స్పీకింగ్ ఆర్డర్ జారీ చేయాలని ఆదేశించారు.ఫారం--6, ఫారం--7, ఫారం--8 దరఖాస్తులను నవంబర్ 5లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. బూత్‌స్థాయి అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు తమ కార్యాలయాల్లో ఎస్ఐఆర్--2026కు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించి భద్రపరచాలని ఆదేశించారు.శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఫారం--18 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు.శాసనమండలి ఎన్నికలకు సంబంధించిన నివేదికను పత్రికలు, ప్రసార మాధ్యమాలకు అందించాలని సూచించారు. సహాయ ఎన్నికల నమోదు అధికారులు, నియమిత అధికారుల కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ఆ నివేదికను ప్రదర్శించాలని ఆదేశించారు..ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, ఎన్నికల సెక్షన్ సిబ్బంది సలీం, నితీష్, సీనియర్ అసిస్టెంట్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..

గిరిజన దర్బార్‌లో ప్రజల సమస్యలు తెలుసుకున్న ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో





ఏటూరు నాగారం. ములుగు జిల్లా అక్టోబర్ 26 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ఏ టూరునాగారం: ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి, వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా విద్యుత్, పోలీస్, గిరిజన సంక్షేమం, విద్య, రహదారులు, డ్రైనేజీలు, ఉద్యోగాలు, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించి దరఖాస్తులు అందాయి.పంట పొలాలకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఒక దరఖాస్తు అందింది. భూ ఆక్రమణలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అంశంపై కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ఫిర్యాదు కూడా అందింది. కొండాయిలో గోవిందరాజుల జాతరకు మండపం, ఎదురుకోలు తదితర ఏర్పాట్లకు సంబంధించి అనుమతులు లేదా ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు.అంకంపల్లి పాఠశాలలో వంటశాల నిర్మాణం, బుర్రతండాలో సీసీ డ్రైనేజీ నిర్మాణం కోసం దరఖాస్తులు అందాయి. రాఘవపట్నం నుంచి రంగాపురం వరకు మట్టి రోడ్డు నిర్మాణం, రాఘవపట్నంలో సీసీ డ్రైనేజీల నిర్మాణం, ఇప్పలగడ్డ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణం, మల్లాయిపల్లిలో సీసీ డ్రైనేజీ నిర్మాణం కోసం కూడా దరఖాస్తులు సమర్పించారు. నందనాయక్ తండా, గీసుగొండ గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి సంబంధించి మరో దరఖాస్తు అందింది.ఆర్ సి ఓ కార్యాలయానికి సంబంధించి ఉద్యోగ నియామకం, డిప్యూటేషన్ తదితర అంశాలపై దరఖాస్తులు అందాయి. 2012 డీఎస్సీ మెరిట్ జాబితా, డ్యూయల్ ఎస్సీ 2012 వివరాలు, పెండింగ్ వేతనాల చెల్లింపు, నియామక అభ్యర్థనలకు సంబంధించి కూడా వినతులు సమర్పించారు.ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా పాస్‌బుక్‌ల కోసం మూడు దరఖాస్తులు అందగా, ఇందిరా జలప్రభ పథకం కింద మూడు బోర్‌వెల్స్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు అందాయి. గూడూరు మండలంలోని ఎకలవ్య పాఠశాల భూమికి సంబంధించిన సమస్యతో పాటు ఐటీడీఏ పరిధిలోని ఇతర అంశాలపై కూడా వినతులు సమర్పించారు.ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ ప్రతాప్, ఏఓ అనిల్, డీడీ జనార్ధన్‌తో పాటు కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు...

సౌత్ జోన్ కరాటే పోటీల్లో ఏటూరునాగారం విద్యార్థుల సత్తా!

- **విశాఖపట్నంలో జరిగిన ఛాంపియన్‌షిప్‌లో రజతం, రెండు కాంస్య పతకాలతో మెరిసిన క్రీడాకారులు!**
- **విద్యార్థుల విజయంపై హర్షం.. కరాటే మాస్టర్ హుస్సేన్‌కు అభినందనలు!.**





ఏటూరునాగారం ములుగు జిల్లా అక్టోబర్ 26 సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించిన 5వ సౌత్ జోన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. దక్షిణాది రాష్ట్రాల స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఏటూరునాగారం మండలానికి గర్వకారణంగా నిలిచారు. ఏటూరునాగారం కరాటే అకాడమీకి చెందిన ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. ఈ పోటీల్లో అండర్-21 విభాగంలో అలువాల సుమనశ్రీ కాంస్య పతకం సాధించి తన ప్రతిభను చాటుకుంది. అదేవిధంగా లిలి52 కేజీల విభాగంలో వసంత విశాల్ సాయి కాంస్య పతకం కైవసం చేసుకోగా, అండర్-8 విభాగంలో ఆధ్య రజత పతకం సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. కఠోర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో పోటీల్లో రాణించి పతకాలు సాధించడం విశేషంగా నిలిచింది. మండల స్థాయి నుంచి దక్షిణాది రాష్ట్రాల స్థాయి పోటీల వరకు తమ ప్రతిభను చాటుకున్న విద్యార్థులు ఏటూరునాగారం కీర్తిని మరింత పెంచారు. క్రీడల పట్ల ఆసక్తి, నిరంతర సాధన ఉంటే ఉన్నత స్థాయిలో విజయాలు సాధించవచ్చని ఈ విద్యార్థులు నిరూపించారు. చిన్న వయస్సు నుంచే కరాటేలో శిక్షణ పొందుతూ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు కరాటేలో శిక్షణ అందించి, వారి ప్రతిభను వెలికితీయడంలో కృషి చేసిన కరాటే మాస్టర్ హుస్సేన్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని, రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ ఏటూరునాగారం పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు...



జైలర్–2.. తెలుగులోనే 100 కోట్లు!

బాక్సాఫీస్ దగ్గర 'తలైవా' సునామీ సృష్టిస్తున్నారు. వయసుతో పనేలేదని, వెండితెరపై తన మేనియా ఎప్పటికీ తగ్గదని నిరూపిస్తూ సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన విశ్వరూపం చూపించారు. ఆయన నటించిన లేటెస్ట్ సెన్సేషన్ 'జైలర్ 2' బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసింది. ముఖ్యంగా తెలుగు వెర్షన్‌లో ఈ సినిమా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 100 కోట్ల గ్రాస్ మార్కును దాటేసి సరికొత్త సంచలనానికి తెరతీసింది. ఒక తమిళ హీరో సినిమా డబ్బింగ్ వెర్షన్ తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ ఈ స్థాయిలో విధ్వంసం సృష్టించడం ట్రేడ్ పండితులనే ఆశ్చర్యపరుస్తోంది. చాలామంది డబ్బింగ్ హీరోల సినిమాలు వస్తుంటాయి పోతుంటాయి.. కానీ రజనీకాంత్ వస్తే ఆ వైబ్రేషనే వేరు. తెలుగు ఆడియన్స్ ఆయన్ను ఎంతగా సొంతం చేసుకున్నారో 'జైలర్ 2' వసూళ్లు మరోసారి కళ్లకు కట్టాయి. మొదటి రోజే వచ్చిన పాజిటివ్ టాక్‌తో థియేటర్లన్నీ హౌస్‌ఫుల్ బోర్డులతో దద్దరిల్లిపోయాయి. ఈ వంద కోట్ల మార్క్‌తో రజనీకాంత్ సౌత్ ఇండియాలోనే అరుదైన మైలురాయిని చేరుకున్నారు. కేవలం తెలుగు వెర్షన్ ద్వారానే నాలుగు సార్లు రూ. 100 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి అడుగుపెట్టిన ఏకైక తమిళ హీరోగా రికార్డులకెక్కారు. ఇతర భాషా స్టార్లకు తెలుగులో ఒకట్రెండు సినిమాలు ఆడటం చూశాం.. కానీ నాలుగు సార్లు సెంచరీ కొట్టడం ఒక్క రజనీకాంత్‌కే చెల్లిందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్క్రీన్‌పై రజినీ స్వాగ్, నెల్సన్ స్టైలిష్ మాస్ టేకింగ్, థియేటర్లలో ఈలలు వేయించే యాక్షన్ సీన్స్ తెలుగు ప్రేక్షకులకు పూనకాలు తెప్పించాయి. బాక్సాఫీస్ దగ్గర రజినీ ర్యాంపేజ్ ఇంకా కొనసాగుతుండటంతో ఫుల్ రన్‌లో 'జైలర్ 2' మరిన్ని పాత రికార్డులను బద్దలు కొట్టడం ఖాయంగా కనిపిస్తోందని అంటున్నారు.



అజిత్ హీరోయిన్‌గా కయాదు లోహర్?

తమిళ స్టార్ హీరో అజిత్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఆయన నటించనున్న 64వ చిత్రానికి 'డేర్ డెవిల్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నవంబర్ 2 నుంచి షూటింగ్ ప్రారంభం కానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. దీంతో ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత అజిత్ మరోసారి దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌తో కలిసి పనిచేయనున్నారు. నిర్మాతల విషయంలో నెలకొన్న సందిగ్ధత, అజిత్ కార్ రేసింగ్ కార్యక్రమాల కారణంగా ఈ సినిమా ఆలస్యమైంది. ఈ చిత్రానికి అజిత్ స్వయంగా నిర్మాతగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. మొదట హీరోయిన్‌గా శ్రీలీల పేరు వినిపించినప్పటికీ, ఆమె ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా ఆమె స్థానంలో కయాదు లోహర్ నటించనున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. అయితే చిత్ర బృందం దీనిపై అధికారికంగా స్పందించలేదు. మరోవైపు అధిక్ రవిచంద్రన్ తన సినిమాల్లో హీరోయిన్ పాత్రకు 'రమ్య' అనే పేరు పెట్టడం ప్రత్యేకతగా కొనసాగుతోంది. 'డేర్ డెవిల్'లోనూ ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తారా? కయాదు లోహర్ హీరోయిన్‌గా ఖరారవుతారా? అన్నది అధికారిక ప్రకటన తర్వాతే స్పష్టత రానుంది.

మా వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దు: రష్మిక



విజయ్ దేవరకొండతో తన వైవాహిక బంధంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలకు నటి రష్మిక స్పందించారు. తమ వ్యక్తిగత జీవితంపై పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఊహాగానాలు చేయొద్దని, ఎడిట్ చేసిన వీడియోలు, అసంపూర్ణ సమాచారంతో తీర్పులు ఇవ్వడం సరికాదని స్పష్టం చేశారు. ఇటీవల 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో పాల్గొన్న విజయ్.. రష్మిక తనను పెళ్లి చేసుకోమని వందసార్లు అడిగిందని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై విజయ్‌ను విమర్శిస్తూ నెట్టింట పోస్టులు రావడంతో రష్మిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. పెళ్లి విషయంలో నిర్ణయం తీసుకోవడానికి విజయ్ సమయం తీసుకోవడంలో తప్పేమీ లేదని పేర్కొన్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుని, జీవితంలోని కష్టసుఖాలను కలిసి ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామో తెలుసుకోవడం ముఖ్యమని రష్మిక అన్నారు. విజయ్‌పై తనకు ఎంతో ప్రేమ ఉందని, ఇద్దరూ పరస్పర అంగీకారంతో ఒకరినొకరు జీవిత భాగస్వాములుగా ఎంచుకున్నామని తెలిపారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు విజయ్ అండగా నిలిచారని, ఇప్పటికీ ఆ మద్దతు కొనసాగుతోందని వెల్లడించారు. ప్రస్తుతం తన జీవితంలో ఎంతో సంతోషంగా ఉన్నానని పేర్కొంటూ, తమ కుటుంబం గురించి తెలియకుండా ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం వేధింపులతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా తనను ఆదరిస్తున్న అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.



రవిబాబు హారర్ సినిమాలో బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్!

టాలీవుడ్‌లో ఓ క్రేజీ కాంబినేషన్ తెరపైకి వచ్చింది. వైవిధ్యమైన కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రవిబాబు.. ఓ హారర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అదే నిజమైతే దాదాపు 17 ఏళ్ల తర్వాత కంగనా మళ్లీ తెలుగు తెరపై కనిపించనున్నట్టే! విభిన్నమైన కథాంశాలు, విలక్షణమైన మేకింగ్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించడం దర్శకుడు రవిబాబు శైలి. ఇటీవల 'రేజర్'తో వార్తల్లో నిలిచిన ఆయన.. ఇప్పుడు హారర్ జానర్‌లో మరో ప్రయోగానికి సిద్ధమవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ ప్రాజెక్టులో కంగనా రనౌత్ నటించనున్నారనే ప్రచారం ఈ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని, చిత్రీకరణ కూడా రహస్యంగా సాగుతోందని కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ వార్తల్లో నిజమెంత? కంగనా నిజంగానే రవిబాబు సినిమాలో నటిస్తున్నారా? అనే ప్రశ్నలకు ఇప్పటివరకు అధికారిక సమాధానం లేదు. కంగనా రనౌత్‌కు తెలుగు ప్రేక్షకులతో గతంలోనే పరిచయం ఉంది. ప్రభాస్ కథానాయకుడిగా, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏక్ నిరంజన్'లో ఆమె కథానాయికగా నటించారు. ఆ సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయమైన కంగనా.. ఆ తర్వాత మరో తెలుగు చిత్రంలో కనిపించలేదు. ఇప్పుడు రవిబాబు హారర్ సినిమాలో ఆమె నటిస్తున్నారనే ప్రచారం నిజమైతే, దాదాపు 17 ఏళ్ల విరామం తర్వాత టాలీవుడ్‌లోకి ఆమె రీఎంట్రీ ఇచ్చినట్లవుతుంది. బాలీవుడ్‌లో తనదైన నటనతో గుర్తింపు సంపాదించిన కంగనా.. హారర్ కథలో ఎలాంటి పాత్రలో కనిపిస్తారనే అంశం ఆసక్తికరంగా మారుతుంది. కంగనా రనౌత్ తదుపరి చిత్రాల గురించి ఇప్పటికే పలు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె ఓ తెలుగు సినిమాలో నటించనున్నారనే ప్రచారం అభిమానుల్లో చర్చకు దారితీసింది. అయితే రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కనున్నట్లు చెబుతున్న హారర్ చిత్రానికి సంబంధించి కంగనా ఎంపిక, కథ, పాత్ర, షూటింగ్ వివరాలపై అధికారిక సమాచారం అందుబాటులో లేదు. ఓవైపు విలక్షణ దర్శకుడు రవిబాబు.. మరోవైపు బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్.. ఈ ఇద్దరి కలయిక నిజమైతే సినిమాపై సహజంగానే భారీ ఆసక్తి ఏర్పడుతుంది. కానీ ప్రస్తుతం ఈ కాంబినేషన్‌పై వస్తున్న వార్తలకు అధికారిక ధ్రువీకరణ లేదు. కంగనా బృందం లేదా చిత్రబృందం నుంచి ప్రకటన వెలువడితేనే ఈ ప్రాజెక్టుపై స్పష్టత రానుంది. అప్పటివరకు ఈ క్రేజీ కాంబినేషన్‌ను ఆసక్తికరమైన ప్రచారంగానే చూడాలి.